

హైదరాబాద్ వార్త


# న్యూఇయర్‌పై డ్రగ్స్‌ముఠా కన్ను..!

**-అప్రమత్తమైన పోలీసులు,ఎక్సైజ్ అధికారులు - ముఠాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు**



**హైదరాబాద్,డిసెంబరు 19,(ప్రభాతవార్త):** ఈఏడాది మరికొద్ది రోజుల్లో ముగియనుండటంతో న్యూఇయర్ హడావిడి మొదలైంది. అందుకు అనుగుణంగా వ్యాపారులు తదితరులు ఏర్పాట్లలో నిమగ్నమైపోయారు. నూతన సంవత్సరం సందర్భంగా డ్రగ్స్ విక్రయదారులు కూడా సిద్ధమౌతున్నారు. ప్రతియేటా న్యూఇయర్ వేడుకలకు నగరంలో భారీగా డ్రగ్స్ సరఫరా అవుతుందని గుర్తించిన పోలీసులు దానిని అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. కార్పొరేట్ హంగులతో దూసుకెళ్తున్న నగరంలో డ్రగ్స్ కల్చర్ మాత్రం రోజు రోజుకూ పెరుగుతుంది. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి పెద్దమొత్తంలో మాదకద్రవ్యాలు స్వాదీనం చేసుకునాన సరఫరా దారులు మాత్రం వెనకడుగు వేయడం లేదు. విద్యార్థులను టార్గెట్ చేయడంతోపాటు మసాజ్ సెంటర్లు, పబ్‌లు, బార్‌లలో యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. నార్కోటిక్, డ్రగ్స్ విభాగాలు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ పోలీసులు అప్పుడప్పుడు ఒకరిద్దరిని పట్టుకున్నప్పటికీ డ్రగ్స్ సరఫరాను పూర్తిగా అదుపు చేయలేకపోతున్నారు. పోలీసుల నిఘాకు చిక్కకుండా తమ నెట్‌వర్క్‌ను పెంచుకున్న సరఫరా దారులు ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థి వీసాపై వస్తూ ఈదందాను ఇక్కడ విస్తరిస్తున్నారు. ముఖ్యంగా ఈముఠాలు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. కోడ్ భాషలోప్రచారం చేస్తూ ఎవరికి అనుమానం రాకుండా తమపని కానిచ్చేస్తున్నారు. డిగ్రీ ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులను గుర్తించి వారితో పరిచయం పెంచుకుంటున్నారు. మత్తు ముందు గురించి కోడ్‌భాషల ద్వారావారికి వివరిస్తూ దందా ప్రారంభిస్తున్నారు. గతంతో రిస్క్‌తీసుకోకుండా పరిచయం ఉన్నవారు,స్నేహితులద్వారానే డ్రగ్స్ విక్రయించేవారు. క్రమేణా దందాను పెంచాలనే ఆలోచనతో వ్యాపారులు కొత్త పంథాను ఎంచుకున్నారు. వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థుల ఫోన్ నెంబర్లు, సోషల్ మీడియా అకౌంట్లను సేకరించివారికి డ్రగ్స్ రుచి చూపించే ప్రయత్నాలు చేస్తున్నారు.

**కోడ్ భాషలో..**

ప్రతియోటా నమోదవుతున్న కేసుల ఆధారంగా డ్రగ్స్ సరఫరా విపరీతంగా పెరిగిపోయిందని గుర్తించిన పోలీసులు ఈదందాకు శాశ్వతంగా అడ్డుకుట్ట వేయాలని వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్లుగా పలువురిని అరెస్ట్ చేసి కోట్ల రూపాయల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంతో సరఫరాదారులు పంతా మార్చారు. సోషల్‌మీడియా ద్వారా వ్యవహారం సాగిస్తూ అనుమానం రాకుండా వివిధ పేర్లతో కోడ్‌భాషల్ ఎవరికి కావాలి..ఎంతమోతాదు..ఎక్కడికి డెలివరీ చేయాలనే అంశాలన్నింటినీ కోడ్‌లోనే కొనసాగిస్తున్నారు.హైదరాబాద్‌లో చిన్నచిన్న ఏజెంట్లతో సరఫరా సాగిస్తుండగా పెద్దపెద్దడీలర్లు, ఢిల్లీ, ముంబై,బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఆధారాలు గతంలో పోలీసులకు లభించాయి.

**ప్రత్యేక బృందాలు...**

న్యూఇయర్ నేపథ్యంలో డ్రగ్స్,గంజాయి ముఠాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు వెల్లడించారు. కొత్తసంవత్సర వేడుకలు సజావుగా సాగేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు ప్రత్యేకంగా టీంల ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈవెంట్ నిర్వాహకులుకానీ, బార్లు,రెస్టారెంట్లలో డ్రగ్స్‌సరఫరా చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





**ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ గౌడ్,అజారుద్దీన్**

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-నగర సిపి విసి సజ్జనార్**




మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో జాగృత హైద్రాబాద్ సురక్షిత హైద్రాబాద్ సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ వీసీ సజ్జనార్.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల మాయాజాలాన్న ఛేదించాలంటే పోలీసుల నిఘా మత్రమే సరిపోదని ప్రతి ఇల్లు ఒక రక్షణ కోటగా మారాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. వెస్ట్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మధురానగర్‌లో నిర్వహించిన జాగృత్ హైద్రాబాద్ సురక్షిత్ హైద్రాబాద్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత ఎంత పెరుగుతుందో మోసాలు అంత కొత్త పుంతలు తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాటరీ తగిలిందనో, గిఫ్ట్ వచ్చిందనో ఆశ చూపి బుట్టలో వేసుకోవడం ఒక ఎత్తు అయితే ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయనో, మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నారంటూ డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి డబ్బులు గుంజేయడం మరో ఎత్తు అని వివరించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించడాన్ని గోల్డెన్ అవర్ అంటారని బాధితులు ఏమాత్రం అలక్ష్యం చేయకుండా వెంటనే 1930కు కాల్ చేయడం లేదా (డబ్ల్యూడ బ్ల్యూ. సైబర్‌క్రైమ్. జివోవీ.ఇన్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయ డం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల వేల ఆఫర్లు, గిఫ్ట్ కూపన్లు పేర్లతో వచ్చే మెసేజ్‌లు, వాట్సాప్ లింకుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నగరాన్ని సైబర్ క్రైమ్ రహితంగా మార్చేందుకు మంగళ, శనివారాల్లో పోలీసులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ ఎగ్జామ్‌లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు సైబర్ సింబా వాలంటీర్ల వ్యవస్థను తెచ్చావన్నారు. సీనియర్లను టార్గెట్ చేస్తున్న నేరగాళ్ల పట్ల కుటుంబసభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ విచారణ వేగవంతంగా జరుగుతుందని త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఐబొమ్మ రవి విచారణలో కీలక సమాచారం రాబడుతున్నామని అదనపు సీపీ(క్రైమ్) శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, వెస్ట్‌జోన్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన సామర్థ్య నివేదికను ఆవిష్కరించిన జిహెచ్‌ఎంసి కమిషనర్

**హైదరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త** జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆయన హైదరాబాద్ వాతావరణ కార్యాచరణ వ్యూహంలో ఇంధన సామర్థం పాత్రను హైలైట్ చేసే సమగ్ర నివేదికను ఆవిష్కరించారు జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్. ఈ నివేదికను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) మీడియా సలహాదారు ఏ.చంద్రశేఖర్ రెడ్డి, ఈఈఎస్ఎల్, రాష్ట్ర ప్రభుత్వం నియమించబడిన ఏజెన్సీ టీఎస్ రెడ్‌కో సహకారంతో రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులను పరిష్కరించడంలో ఇంధన సామర్థం మాత్రమే 40 శాతానికి పైగా దోహదపడుతుందని చెప్పారు. అదుపులేని మానవ కార్యకలాపాలు గాలి, నీరు,నేల కాలుష్యానికి దారితీశాయని ఆవేదన వ్యక్తంచేశారు. వన్యప్రాణులు, మానవ ఆరోగ్యం మరియు స్థిరమైన అభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని గుర్తుచేశారు. సుమారు 36,746 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ వాతావరణ మార్పులను తట్టుకోగల, ఇంధన సామర్థం గల క్యాంపస్‌ను సృష్టించడంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు.దీని ద్వారా ఏటా 7 వేల కిలోవాట్ల ఇంధనం ఆదా అవుతుందని అంచనా వేశామన్నారు. హైదరాబాద్ ఇంధన సామర్థ్య కార్యక్రమాల యొక్క స్పష్టమైన ఫలితాలను హైలైట్ చేస్తూ ఈఈఎస్ఎల్ కొన్ని వార్షిక ప్రయోజనాలను నివేదించింది. వాటిలో 238.83 మిలియన్ యూనిట్ల ఇంధన ఆదా చేసినట్లు తెలిపింది. ఇక గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో తగ్గింపులో భాగంగా 59.49 మెగావాట్లు తగ్గించినట్లు పేర్కొంది. దీనిద్వారా వార్షిక వ్యయ పొదుపు రూ. 193.45 కోట్లు మేర అయ్యిందని వెల్లడించింది. కార్బన్ ఉద్గారాలను 0.19 మిలియన్ టన్నులు తగ్గించామని తెలిపింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 15.41 లక్షల వీధి దీపాలలో జీహెచ్ ఎంసీ పరిధిలో 5.53 లక్షల ఎల్ఈడీ వీధి దీపాల రెట్రోఫిట్టింగ్‌ను పూర్తి చేసింది.




ఇంధన సామర్థ్య నివేదికను ఆవిష్కరిస్తున్న జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

## గోల్కొండ కోటను సందర్శించిన భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్



భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తో బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ చంటిబాబు, ఈవో వసంత.

**మెహిదీపట్నం, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ శనివారం గోల్కొండ కోటను తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గోల్కొండ కోటలోని పురాతనమైన కట్టడాలతో పాటు రాణి మహల్, లైటింగ్, హ్యాండ్ సౌండ్ లతో పాటు జాతీయ జెండా పతాక ఆవిష్కరణ ప్రదేశాలను చూశారు.ఆయన వెంట జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో పాటు గోల్కొండ దేవాలయ బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ చంటిబాబు, దేవాలయ ఈవో వసంత స్థానిక నేతలు బాల ప్రసాద్ తివారి, నాగేశ్వర్,చంద్రశేఖర్, శ్రీకాంత్, సంతోష్ గౌడ్ లు ఉన్నారు.

## టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళన చేపట్టిన కొత్వాల్ సజ్జనార్

**హైదరాబాద్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నగర పోలీసు విభాగంలో ఒక్కో దాని ప్రక్షాళన ప్రారంభించారు. ఇంతకు ముం దు శాంతి భద్రతల విభాగంలో ప్రక్షాళన మొదలు పెట్టి ఎసిపిలను మొదలుకొని ఎస్ఐల వరకు వేటు వేయడం తెలిసిందే. అవినీతి మకిలీ అంటిన వారిని వరుసగా బదిలీ చేయడం లేదా సస్పెండ్ చేయడం విదితమే. ఈ క్రమంలో రెండవ దఫాగా ఆయన కీలకమైన టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళనకు న డుం బిగించారు. సిటీ టాస్క్‌ఫోర్స్ నగర పోలీసు విభాగానికి కీలకమైనదనడం తెలిసిందే. అసాంఘీక శక్తులతో పాటు రౌడీలపై నిరంతరం నిఘా వుంచడంలో టాస్క్‌ఫోర్స్‌ది ముఖ్య భూమిక అనడం విదితమే. అయితే కొంతకాలంగా అవినీతి ఆరోపణలు ఈ విభాగంపై వెల్లువెత్తాయి. ఈ నేప థ్యంలో ఎస్ఐల నుంచి కానిస్టేబుల్ వరకు మొత్తం 80 మంది సిబ్బందిని టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీ చేస్తూ సజ్జన్నార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ బాస్‌గా ఐపిఎస్ అధికారి వైభవ్ గైక్వాడ్ డిసిపిగా వుండగా ఆయన ఆధ్వ ర్యంలో సెంట్రల్, నార్త్ జోన్లతో పాటు నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ వున్నాయి. డిసిపికి డిప్యూటీలుగా వున్న సౌత్ జోన్ అదనపు డిసిపి ఆధ్వ ర్యంలో సౌత్, సౌత్, వెస్ట్, ఈస్ట్ జోన్లు వున్నాయి. సౌత్..వెస్ట్ అదనపు డిసిపి ఆధ్వర్యంలో వెస్ట్, సౌత్, వెస్ట్ జోన్లు వున్నాయి. ఇలా టాస్క్‌ఫోర్స్ నగర పోలీసు విభాగంలో కీలకంగా మారింది. ఇప్పుడు ఈ విభాగాన్ని కొత్వాల్ సజ్జన్నార్ పూర్తిగా మార్చివేయాలని నిర్ణయించి కొత్త రక్తాన్ని ఎక్కిం చారు.

## నగరంలో మరో రెండు రోజులు వణుకే

**-తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు**

**బేగంపేట డిసెంబరు 20,ప్రభాతవార్త**

హైదరాబాద్ నగరంలో చలి తీవ్రత పెరగడంతో గజ గజ వణుకుతున్నారు.ఇదే పరిస్థితి మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలియజేసారు.ఉదయం 9గంటలకు సైతం వణుకు పుట్టిస్తుండటంతో ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు గజ గజ వణుకుతున్నారు.ఇక ఉదయం సమయంలో కొన్ని ప్రాంతాల్లో మంచు కూడా కురుస్తుండటంతో వాహనదారుల ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా మారింది.ఇదే పరిస్థితి మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.ఉత్తర భారత దేశంలో చలి గాలులు తీవ్రత అధికంగా ఉండటం,అక్కడి నుంచి చలిగాలులు ఈశాన్యదిశగా రాష్ట్రంలోకి చలిగాలుల ప్రభావం అధికంగా ఉండటంతో నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.సాయంత్రం సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతుండటంతో నగర వాసులు వణుకిపోతున్నారు.హైదరాబాద్ నగరంలో శనివారం 11.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## విద్యార్థులకు మెరుగైన వసతులు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



పాఠశాలకు సామాగ్రిని అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**సికింద్రాబాద్, డిసెంబర్ 20 ప్రభాతవార్తః** బన్సీలాల్ పేట్‌లోని గుండా ఈశ్వరయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఐడిబిఐ బ్యాంక్ సహకారంతో సిఎస్ఆర్ నిధులతో రెండు లక్షల విలువైన పాఠశాల సామాగ్రిని పంపిణీ చేశారు. పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, విద్యార్థిని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరచాల్సి ఉందని అన్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ మిషన్లు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజును సైతం తన జీతం నుంచి చెల్లించానని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## పేలిన వాటర్ హీటర్

**-మొదటి అంతస్తు అంతటా వ్యాపించిన మంటలు**
**-ఏడుగురిని కాపాడిన 'ఫైర్' సిబ్బంది**

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త** నగరంలోని నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వడ్డెరబస్తీలో శనివారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే పోలీసుల అప్రమత్తతతో ఈ ఘటనలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఒక కుటుంబం ఎదుర్కొన్న ప్రమాదం క్షణాల్లో ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నప్పటికీ,, సకాలంలో పోలీసులు తీసుకున్న చర్యలతో ఏడుగురు కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెరబస్తీలోని ఓ ఇంటి మొదటి అంతస్తులో కుటుంబసభ్యులు వాటర్ హీటర్‌ను ఆన్ చేసి మర్చిపోయారు. కాసేపటికి హీటర్ అధిక ఉష్ణోగ్రతకు చేరుకుని ఒక్కసారిగా పేలిపోయింది. ఈ పేలుడుతో మంటలు చెలరేగి మొదటి అంతస్తు అంతటా వ్యాపించాయి. పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా దెబ్బతిన్నాయి. ముఖ్యమంగా టీవీ, ఫ్రీజ్ వంటి పరికరాలు మంటల్లో చిక్కుకోవడంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ ఇంటి మూడో అంతస్తులో ఏడుగురు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో వారు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగతో నిండిన ఇంట్లో చిక్కుకున్న కుటుంబ సభ్యులు భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందిన వెంటనే నల్లకుంట పోలీసులు ఎలాంటి ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఈ పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదంతో మెట్లమార్గాన్ని కూడా ఉపయోగించలేని పరిస్థితి మారింది. పోలీసులు తాడు సహాయంతో పై అంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులను కిందకు దించారు. ఒక్కొక్కరిని జాగ్రత్తగా కిందకు దిచ్చి మొత్తం ఏడుగురు కుటుంబ సభ్యులను సురక్షి తంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఘటనలో పోలీసుల ధైర్యసాహసాలు, అప్రమత్తతను స్థానికులు ప్రశంసించారు.అగ్ని ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులకు భారీ నష్టం వాటిల్లినప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం అందరికీ ఊరట ఇచ్చింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే వరకు స్థానికులు కూడా సహకరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు.ఈ ఘటనపై పోలీసులు స్పందిస్తూ.. వాటర్ హీటర్ లు, గీజర్లు, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరం లేని సమయంలో ఆన్లో ఉంచకూడదని తెలిపారు. పాత ఎలక్ట్రానిక్ పరికరాలను వాడకూడదని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయొచ్చని ఈ ఘటన మరోసారి రుజువు చేసిందని పోలీసులు పేర్కొన్నారు.

## అడిక్‌మెట్ డివిజన్ వడ్డెర బస్తీలో అగ్నిప్రమాదం

**-వివరాలు ఆరాతీసిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**

**చిక్కడపల్లి డిసెంబర్ 20 ( ప్రభాతవార్త ) :** అడిక్ మెట్ డివిజన్ వడ్డెర బస్తిలో శనివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తీవ్ర ఆస్తినష్టం జరిగింది. విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును బిఆర్ ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు అనురాధ, నేతా శ్రీను, రాజు, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

## పివి నరసింహా రావు ఫ్లైఓవర్‌పై మూడు కార్లు ఢీ

**-ఆరు కిల్లో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్**



**అత్తాపూర్ డిసెంబర్ 20,ప్రభాతవార్త :** పివి నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై నిత్యం రోడ్డు ప్రమాదాలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.శనివారం ఉదయం పివి నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై మెహదిపట్నం నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వైపు వెళ్తుండగా పిల్లర్ నెంబర్ 235 ఫిస్ బిల్డింగ్ సమీపంలో పొగమంచు కారణంగా ముడు కార్లు ఎకదానికి ఒకటి ఢీకోన్నాయి.దింతో పలువురికి గాయాలయ్యాయి.అయితే మూడు కార్లు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ఆ రూట్లో రెండు వైపులా సుమారు 6 కిల్లో మీటర్ల వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజు,సిబ్బంది కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు.

## హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో పుస్తకం ఒక దారిదీపం



సభలో ప్రసంగిస్తున్న కన్నాభిరాన్, రమేష్ తదితరులు

**ముషీరాబాద్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** చేసే పనిపై నమ్మకం, విమర్శలను ఎదుర్కొనే ధైర్యం, శక్తి ఉండాలని ప్రముఖ రచయిత్రి వసంత కన్నాభిరాన్ అన్నారు. 38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో తన పుస్తక విశేషాలను పంచుకుంటూ 4దశాబ్దాల క్రితం వ్రాసిన పుస్తకాన్ని పాఠకులు నేటికీ ఆదరించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. కఠోర షడ్జమాలు అనే పేరు తన పుస్తకానికి రావడానికి వెనకున్న ఉదంతాన్ని వివరిస్తూ ఒక విమర్శకుడు తనను ఉద్దేశించి వసంత కోకిల పలిలే కఠోర షడ్జమాలుఅని ఎగతాళి చేస్తే ఆ విమర్శనే సవాలుగా తీసుకుని తన పుస్తకానికి దాన్నే శీర్షికగా పెట్టానన్నారు. అదే నన్ను ఇన్నాళ్లూ ముందుకు నడిపించిందని స్పష్టం చేశారు. గతంలో సమాజంలోనున్న భిన్నత్వం, వైవిధ్యం నేడు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తపరిచారు. తాను పెరిగిన ప్రాంతంలోని పాతజ్ఞాపకాలతో ప్రస్తుతం ఒక నవలను వ్రాస్తున్నట్లు కన్నాభిరాన్ వెల్లడించారు. అనంతరం ప్రముఖ దర్శకుడు బి.నర్సింగ్‌రావు పుస్తక పఠనం ఒక పండుగని అభివర్ణించారు. తన జీవితంలో పుస్తకం అంతర్భాగమన్నారు. తెలంగాణ ఉద్యమనాటి పుస్తకాన్ని తానెప్పుడూ వీడలేదని, ముఖ్యంగా కవిత్వమంటే తనకెంతో ఇష్టమన్నారు. తన సంపాదనలో అగ్రభాగం పుస్తకాలకే వెచ్చిసానని తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు రాంపల్లి రమేష్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన కేవలం సాహిత్య వేడుక కాదు అణచివేతపై అదొక రాజకీయ చర్యని అభిప్రాయపడ్డారు. ఆలోచనలను హరిస్తున్న నేటి డిజిటల్ స్క్రీన్ యుగంలో మనిషిని చైతన్యపరిచే ఏకైక ఆయుధం పుస్తకమేనని స్పష్టం చేశారు.ఈ మేళా ఒక విశ్వవిద్యాలయం వంటిదని, ఇక్కడి పుస్తకాలు సమాజ మార్పుకు మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షించారు. చివరిగా బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి ప్రసంగకర్తలను ఘనంగా సత్కరించారు.

## జెహెచ్‌పిఎస్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన




ప్రతిభాదర్శన్‌లోలో విద్యార్థుల ప్రదర్శన

**జూబ్లీహిల్స్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జెహెచ్‌పిఎస్)లో నర్సర్ ది నేచర్ పేరుతో నర్సరీ, ఎల్‌కెజీ విద్యార్థులకు ప్రతిభాదర్శన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక, నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల డైరక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ.. ప్రకృతిని పరిరక్షిస్తే అది మనల్ని పరిరక్షిస్తుంది, విద్యార్థులకు చిన్నతనం నుండి దీనిని తెలియజేయా ల్సిన అవసరం ఉందన్నారు. మంచి అలవాట్లను పెంపొందించడం ద్వారా విద్యార్థులు మంచి దారిలో ముందుకు వెళ్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యక్షుడు మురళీముకుంద్ అభినందించారు.

## 29వ ఉచిత శిక్షణా కార్యక్రమం




**జీడిమెట్ల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, ల్యాబొరేటరీ భద్రతా ప్రమాణాలు, ఇండస్ట్రియల్ గ్యాస్ టెస్టింగ్, ఫైర్ సేఫ్టీ, అలాగే ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను వ్యవస్థబద్ధంగా, ముందస్తుగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ అశోక్ పొడిశెట్టి పాల్గొని, భద్రతను కేవలం నిబంధనల పరిమితికి కాకుండా సంస్థ సంస్కృతిలో భాగంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం, ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ జనరల్ సెక్రటరీ ఎ. సూర్య ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హరి బుక్క, జి. జగదీశ్వరరావు, ఈ. తిరుపతి హాజరై పరిశ్రమలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఈహెచ్ఎస్ సమస్యలపై చర్చల్లో పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 80కి పైగా కంపెనీలకు చెందిన ఈహెచ్ఎస్, పర్యావరణ నిపుణులు, ల్యాబొరేటరీ సిబ్బంది, సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అలాగే ఎస్‌సిఎం, హెచ్‌ఆర్ విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ కాలనీ వాసులు కె రమణమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించి ఆయన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 3,00,000 సీఎం సహాయనిధిని మంజూరి చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అచ్చమ్మా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష



**నిజాంపేట్, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

నేడు జాతీయ గణిత దినోత్సవ వేడుకలు 2025 లో భాగంగా తెలంగాణ మాథెమాటిక్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేట్ యందు బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరిక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గణిత ప్రతిభా పరిక్షను ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన బాచుపల్లి మండల విద్యాధికారి ఎంవీవీ రామక్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గణితం పట్ల అభిరుచి పెంచుకొని గణితంలో బాగా నైపుణ్యం పెంచుకుంటే భవిష్యత్తులో ఇంజనీర్స్‌గా ఆర్కిటెక్ట్‌గా గొప్పగా ఎదుగొచ్చని అన్నారు, ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రం నిర్వాహకులు పర్మగల్ల నర్సింలు, గణిత ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, భారతి, జాయ్ హావీల, విద్యార్థులు పాల్గొన్నారు.

### హిజాబ్ ఘటనపై బీహార్ సిఎం క్షమాపణలు చెప్పాలి : కాంగ్రెస్

**చార్మినార్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రజా కార్యక్రమంలో పాల్గొన్న ఓ మహిళా వైద్యురాలి హిజాబ్‌ను లాగి తొలగించిన ఘటనకు నిరసనగా శనివారం చార్మినార్ నుంచి గుల్జార్‌హౌస్ వరకు కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. గుల్జారాహౌస్ వద్ద కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. బిహార్ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా మాట్లాడుతూ బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వెంటనే ప్రజల ముందు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా, ఆల్ ఇండియా మీడియా కోఆర్డినేటర్ యూత్ కాంగ్రెస్ శైలేందర్, మార్కెటింగ్ కమిటి వైస్ చైర్మన్ శ్రీనివాస్, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పులిపాటి రాజేష్ కుమార్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయ నరేష్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముజీబుల్లా షరీఫ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. కన్నయ్యాలాల్, మూసాకాశిం, సయ్యద్ ఇక్బాల్, అస్గర్ అలీ, రజా అలీ. మీర్ మహ్మద్ అలీ మహిళలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి




ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రొఫెసర్ లింబాద్రి, డాక్టర్ సృజన తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 20 (ప్రభాతవార్త ) :** యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ముందుకు రావాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లా కళాశాలలో కాకయూత్ పార్లమెంట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ యువత రాజకీయాలలో విధాన నిర్ణయాలలో పాలుపంచుకోవడానికి గల ఆవశ్యకతను వివరించారు. దైనందిన జీవితంలో రాజ్యాంగ విలువలను ప్రతిబింబించే విధంగా మానవ జీవితం ఉండాలన్నారు. విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ ఆచార్య లింబాద్రి మాట్లాడుతూ కాకా యూత్ పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, కాక వెంకట స్వామి అంబేద్కర్ గారి సలహా మేరకు ఈ కళాశాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యను అందించేటువంటి కార్యక్రమానికి పునాదులు వేశారన్నారు. విద్యార్థులకు పార్లమెంటరీ ప్రక్రియ, చట్టాలు రూపకల్పన పై అవగాహన జ్ఞానం కల్పించడానికి నిర్వహించే ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లా కళాశాల విద్యార్థులు పార్లమెంటరీ సభ్యులుగా, స్పీకర్ గా , ప్రతిపక్ష నాయకులుగా పాల్గొన్నారు. కార్యక్రమమ్నో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి రమణ కుమార్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన , లా కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

**22 న అంబేద్కర్ కళాశాలకు గవర్నర్ రాక**

బాగ్ లింగంపల్లి డాక్టర్ బిఆర్ లా కళాశాల అలుమ్ని పూర్వ విద్యార్థుల సమావేశం 22 న కళాశాల ప్రాంగణంలో నిర్వహించబోతున్నట్లు వివరించారు. ఆ రోజు ఉదయం జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిధిగా హాజరవుతారని, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు.

## రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే మార్చాలి

**-హర్యాన పూర్వ బండారు దత్తాత్రేయ**




ప్రసంగిస్తున్న హర్యాన పూర్వ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్ డిసెంబర్ 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండిఏ తీసుకువచ్చిన మాస్టర్ ప్లాన్ రైతాంగానికి నష్టదాయకంగా మారిందని, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మాస్టర్ ప్లాన్ ను తక్షణమే మార్చి రైతులకు అనుకూలమైన రీతిలో రూపొందించాలని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. హైదరాబాద్ తో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం 7257 చ. కిమీ. విస్తీర్ణంతో 2013 లో మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందని, ప్రస్తుతం హెచ్ ఎం డి ఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాలలోని 70 మండలాలు, 24 మునిసిపాలిటీలు, 8 మునిసిపల్ కార్పొరేషన్లు, సుమారు 750 గ్రామాలు ఉన్నాయని, అయితే ఇటీవల 20 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లను జిహెచ్ ఎం సి లో విలీనం చేయడం జరిగిందని, మస్టర్ ప్లాన్ వల్ల ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి ఏమోగానీ రైతుల పాలిట మాత్రం శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ లో భూములను కన్సర్వేషన్ (వ్యవసాయం) పబ్లిక్‌సెమి పబ్లిక్, రిక్రియేషన్, ఓపెన్ స్పేస్, ట్రాఫిక్, రవాణా, పెరిఅర్బన్, రెసిడెన్సియల్ (నివాస), కమర్షియల్ (వాణిజ్య), ఇండస్ట్రియల్ (పారిశ్రామిక), మల్టిపుల్ (బహుళ ప్రయోజన) తదితర జోన్లుగా విభజించడం జరిగిందని, పేద, అమాయక, సన్న, చిన్నకారు రైతుల భూములు ఇండ్ల నిర్మాణానికి కూడా అవకాశం లేని కన్సర్వేషన్ లాంటి జోన్లలో ఉన్నాయని, ఈ కారణంగా దాదాపు 50 వేల మంది రైతులు తమ భూములలో సొంత ఇల్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గ్రోత్ కారిడార్ లో ప్రతిపాదించిన 100 అడుగుల వెడల్పు గల గ్రిడ్ రోడ్డు విషయం పునరాలోచించాలని అన్నారు. ఈ సదస్సులో లోక్ సత్తా అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ్, పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఆదర్శ రైతు, పద్మశ్రీ చింతల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ చర్చా వేదిక సంయోజకులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి , మాజీ శాసన సభ్యులు కె.ఎస్.రత్నం , విశ్రాంత ఐఏఎస్ అధికారి నిర్మల గోనెల , ఫ్యుటరిస్టిక్ సిటీస్ వ్యవస్థాపకురాలు కరుణ గోపాల్, గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## పాతబస్తీ ప్రజల భద్రత కోసమే నాకాబందీ : డిసిపి కిరణ్ ఖరే

**- పలువురి వేలి ముద్రల పరిశీలన**
**- తనిఖీలలో 110.వాహనాలు సీజ్**

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** పాతబస్తీ ప్రజల భద్రత కోసమే నాకాబందీ నిర్వహిస్తున్నట్లు దక్షిణ మండలం డిసిపి కిరణ్ ప్రభాకర్ ఖరే పేర్కొన్నారు. జోన్‌లోని రెండు ఏసిపి, ఆరు లా అండ్ ఆర్డర్, రెండు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి శాలిబండ హిమ్మత్‌పురా చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వేలి ముద్రలను తమ వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో సరిపోల్చారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మొత్తం 120.మంది పోలీసు సిబ్బంది సహాయంతో వాహన తనిఖీలు చేయగా వాటిలో 110వరకు వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు లేవని, ఫ్యాన్సీ నెంబర్లు రాయటం, వాహన పత్రాలు లేకపోవడం వంటి వాటిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. వాహనాలలో గంజాయి, డ్రగ్స్ వంటి నిషేదిక వస్తువుల తరలింపుపై దృష్టి కేంద్రీకరించనట్లు తెలిపారు. నాకాబందీ పాతనగర ప్రజల కుటుంబాలు, పిల్లల రక్షణ కోసమే అన్నారు. ఎవరైనా నిబంధనలు, చట్టాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆకస్మిక తనిఖీలతో రౌడీషీటర్లు, సమస్యలు సృష్టించే వారిని గొలుసు దొంగలను నియంత్రించే అవకాశం ఉందన్నారు. గత 20.రోజులుగా సౌత్ జోన్‌లోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నాకా బంది కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు 22.వందలకు పైగా వావహనాలను సీజ్ చేశామన్నారు. తనిఖీలతో పాటు రౌడీషీటర్లు, సమస్యలు సృష్టించే వారు, మాదక ద్రవ్యాలను సరఫరా చేసేవారు గొలుసు దొంగల కార్యకలాపాలు, అర్ధరాత్రి సంచరించే వారి సంఖ్య తగ్గినట్లు పేర్కొన్నారు. ఇకముందు నాకా బందీని కొనసాగిస్తామన్నారు. పాతనగర ప్రజలు నాకా బందీకి ఎంతో సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో అదనపు డిసిపి మహ్మద్ మజీద్, ఏసీపీలు చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

### భగత్ సింగ్ నగర్ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించడానికి చర్యలు : మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి డిసెంబర్ 20 ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లి భగత్ సింగ్ నగర్ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించడానికి చర్యలు తీసుకుంటానని రాష్ట్ర బీసీ సంక్షేమం, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నేతృత్వంలో భగత్ సింగ్ నగర్ నిర్వాసితులతో కలిసి మంత్రిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తో ఫోన్ లో సంప్రదించి ఈ విషయంలో సమస్య పరిష్కరించడంతో పాటు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బి ఆర్ ఎస్ యువనేత ముఠా జయసింహ, డివిజన్ పార్టీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శంకర్ ముదిరాజ్, దామోదర్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, కళ్యాణ్ నాయక్, నితిన్, బస్తీ వాసులు లింగమయ్య, శీను, రాములు, సురేష్, వినయ్, గాలయ్య, శాంత, అలివేలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను పెంచుతాయి



విద్యార్థులు తయారు చేసిన పరిశోధనలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**నార్సింగి, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను పెంచుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్‌లోని ఎల్‌ఎస్‌ఆర్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ పరిశోధనలు చూసి, వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకొని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే తత్వంను పెంచుకుంటేనే విద్యార్థులు పరిశోధన రంగంలో రాణిస్తారని తెలిపారు. పాఠ్య పుస్తకాలతో పాటు సామాజిక అంశాలు, దేశభక్తి, క్రమశిక్షణ వంటి అంశాలను విద్యార్థి దశలోనే ఒంటబట్టిస్తే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థి సమగ్ర వికాసానికి చదువులు ఉపయోగపడాలని, ఈ విషయంపై అన్ని పాఠశాలలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, నాయకులు కృష్ణారెడ్డి, రాందాస్, సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, సాయిబాబాగౌడ్, పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోల్ సేల్ మార్కెట్‌లో రిటైల్ అమ్మకాలను నిలువరించాలి

**మెహిదీపట్నం, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ కూరగాయల హోల్ సేల్ మార్కెట్ లో రిటైల్ అమ్మకాలను నిలవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబేద్కర్ కూరగాయల రిటైల్ వ్యాపారులు మార్కెట్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. దీంతో మార్కెట్ కార్యాలయంకు రిటైల్ వ్యాపారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా చేయడంతో మార్కెట్ కార్యాలయం అంతా ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. మార్కెట్ అధికారులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రిటైల్ వ్యాపారుల ధర్నాను విరమింప జేశారు. ఈ సందర్భంగా రిటైల్ వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షులు మండలి జయరాజ్ మాట్లాడుతూ... కూరగాయల హోల్ సేల్ మార్కెట్ లో డీటెయిల్ అమ్మకాలు జరుగుతుండడంతో రిటైల్ మార్కెట్ లో వ్యాపారం జరగక వ్యాపారులంతా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల హోల్‌సేల్ మార్కెట్లో రిటైల్ అమ్మకాలపై గతంలో మార్కెట్ పాలక మండలికి, మార్కెట్ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన రిటైల్ అమ్మకాలను నిలువరించలేక పోవడంతోనే మార్కెట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నాకు దిగడం జరిగిందని తెలిపారు. మార్కెట్ అధికారులు పాలకమండలి పలుమార్లు నచ్చ చెప్పడంతోనే ఇన్ని రోజులుగా రిటైల్ వ్యాపారులమంతా వేచి చూడడం జరిగిందన్నారు. మార్కెట్ ఉన్నతాధికారులు, పాలక మండలి చేతులెత్తేయడంతోనే ధర్నా చేశామని, రిటైల్ వ్యాపారులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. ధర్నాలో రిటైల్ వ్యాపారుల అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సాబే ర్, గోవిందు, శంకర్, శ్రీకాంత్, దినేష్ సింగ్ రిటైల్ వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అదృశ్యమైన మహిళ దారుణ హత్య

**నార్సింగి, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** అదృశ్యమైన మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లాకు చెందిన వెంకటయ్య భార్య మొగులమ్మ(49) బతుకు దెరువు కోసం రాజధాని హైదరాబాద్ శివారుల్లోకి వలస వచ్చింది. గండిపేట మండలం ఖానాపూర్ ప్రాంతంలో ఉంటూ దినసరి కూలీగా పని చేస్తుంది. ఈమెకు ఓ కుమారుడు, కూతురు సంతానం. రెండు రోజుల క్రితం ఆమె అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినా సమాచారం లేకపోవడంతో నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఓ నిర్మాణం జరుగుతున్న ఇంటి గదిలో మొగులమ్మ దారుణ హత్యకు గురై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా తలపై, మొదపై బండరాయితో మోదిన గాయాలు కనిపించాయి. ఈమె కాల్లకున్న వెండి కడియాలు ఎత్తుకెళ్లారన్న పుకార్లు వినిపిస్తున్నాయి. ఈమెను ఎవరు హత్య చేసి ఉంటారు? ఎందుకు చేసి ఉంటారనేది తెలుసుకునేందుకు, హంతకులను పట్టుకునేందుకు నార్సింగి పోలీసులు ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జల్సాలకు అలవాటు పడి.. వాహన చోరీబాట

**- సొంత తల్లి ఆభరణాలు సైతం చోరీ**
**- నిందితుడు అరెస్ట్ ..ఐదు వాహనాలు స్వాధీనం**



అరెస్ట్ అయిన నిందితుడు, పట్టుబడిన వాహనాలు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో వాహన చోరీలకు పాల్పడుతున్న ఒక ఘరానా నేరస్థుడిని సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్, బోరబండ పోలీసులు అరెస్ట్ చేశారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండలోని ఇందిరానగర్‌కు చెందిన మంజుల్ తుషార్(23) హోటల్స్‌లో హెల్పర్‌గా పనిచేస్తుంటాడు. అతని తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా తల్లి ఖైరతాబాద్‌లోని సివిల్ సప్లైస్‌లో పనిచేస్తుంది. నిందితుడి అన్న జెన్‌పాక్ట్‌లో పనిచేస్తున్నాడు. ఇంటర్మీడియట్ వరకు చదివిన తుషార్ ధూమపానానికి, మద్యానికి, గంజాయికి అలవాటు పడ్డాడు. దీంతో పాటు బెట్టింగ్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. విలాసవంతమైన జీవితం గడపడానికి తన కోరికలు తీర్చుకోవడానికి అతని సొంత ఇంట్లోనే తల్లికి చెందిన బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అనంతరం వాటిని మధ్య ప్రదేశ్‌లో విక్రయించి ఆయా డబ్బులతో జల్సా చేశాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో వాహన దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇలా మధురానగర్, మాదాపూర్, కూకట్‌పల్లి, అల్వాల్, ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన చోరీలకు పాల్పడ్డాడు. బోరబండ ప్రాంతంలో సౌత్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో తుషార్ అనుమానస్పద స్థితిలో వాహనంతో పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా అసలు విషయం బయటపడింది. సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, బోరబండ డిఐ సైదులు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై విజయానంద్ ఇతన్ని పట్టుకొని విచారించారు. విచారణలో భాగంగా మధురానగర్, ఎస్సారనగర్, మాదాపూర్, కూకట్‌పల్లి, అల్వాల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి పాల్పడిన అయిదు ద్విచక్రవాహనాలతోపాటు అంతకముందు చోరీకి పాల్పడిన బోరబండ, మధురానగర్, కూకట్‌పల్లి, అల్వాల్, ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆరు వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడు. పట్టుబడిన అయదు వాహనాల విలువ దాదాపు 2.50లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్దిఖీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## బిఆర్ఎస్ పార్టీ పటిష్టతకు నాయకులంతా సమిష్టిగా కష్టపడాలి : కార్తిక్‌రెడ్డి



మణికొండలో జరిగిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి.

**నార్సింగి, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కష్టపడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతపై నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్తిక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. మణికొండలో ఓటర్ల సంఖ్యను అనుసరించి నాలుగు డివిజన్లు ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్ని డివిజన్లు ఉన్నా వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు నాయకులంతా ఐక్యంగా ముందుకెళ్లాలన్నారు. గత ఎన్నికల్లో మనస్పర్థల కారణంగా బిఆర్ఎస్ నేతలే బిఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి కారకులయ్యారన్నారు. ఇలాంటివి ఇకపై జరుగడానికి వీలులేదన్నారు. ఎన్నికల వేళ కేవలం 48.శాతం మందే ఓట్లు వేస్తున్నారని, మిగితా వారిని కూడా బూత్ వరకు తీసుకు వచ్చి ఓట్లు వేయించే బాధ్యతను నాయకులు తీసుకోవాలన్నారు. 2.లక్షలకు పైగా జనాభా ఉన్నా 90.వేల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారని, మిగితా అందరికి ఇక్కడే ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని, ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించి అధికారులు, పాలకులచేత సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం శారద వాగ్గేయకార సంగీతోత్సవం




వాగ్గేయకార సంగీతోత్సవంలో కళాకారుల కీర్తనల ఆలాపనా దృశ్యం

**నాంపల్లి, డిసెంబరు 20 ప్రభాతవార్త :** శారద మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో సంస్థ వార్షికోత్సవ సంగీత వేడుకల్లో భాగంగా అకాడమీ శిష్యగణంచే వాగ్గేయకార సంగీతోత్సవం హాజరైన అశేష ప్రేక్షకులను భక్తిమార్గంలో పయనింపజేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసింది. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు డా. కుప్పా శారద శారదా మ్యూజిక్ అకాడమీని స్థాపించి వందలాదిమంది విద్యార్థులకు అద్భుత సంగీత శిక్షణ కావిస్తూ సంగీతకళారంగ అభివృద్ధికి తనవంతు విశేషకృషిచేస్తూ ఉండడం శ్లాఘనీయం. ఈనాటి వాగ్గేయకార సంగీతోత్సవంలో ప్రముఖ వాగ్గేయకారుల కృతులు శాస్త్రీయబద్ధంగా ఆలపించి సంగీతాభిమానులను మైమరపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రముఖ వీణా విద్వాంసురాలు అయ్యగారి శ్యామసుందరం, జయలక్ష్మి, ప్రత్యేక అతిథి ప్రముఖ సంగీత విద్వాంసులు డి.వి.మోహనకృష్ణలు పాల్గొని విద్యార్థుల ప్రతిభాపాటవాలను ప్రశంసించి జ్ఞాపికలు అందజేసి శుభాశీస్సులందజేశారు. భారతీయ సంస్కృతిని కాపాడుకోవడానికి శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని తల్లిదండ్రులకు, విద్యార్థులకు సవివరపరిచారు.

### దివ్యాంగులకు 42 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయాలి

**చిక్కడపల్లి డిసెంబర్ 20 ప్రభాతవార్త :** రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో దివ్యంగులకు 42 శాతం బిసి రిజర్వేషన్ లు కల్పించి పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ ( డి ఎస్ డి ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశా రు. శనివారం చిక్కడపల్లి లోని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ ( డి ఎస్ డి ) రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడా రు. గతములో ఎన్నికల మేనిఫెస్టో ప్రకారంగా దేశంలో రాష్ట్రములో జనాభా ప్రాతిపదికన చట్ట ప్రకారం రిజర్వేషన్ లు కేటాయించాలని, అదే విధంగా దేశంలో అన్ని రాష్ట్రములో దివ్యంగుల పెన్షన్ రూ.10 వేలు ఉండే విధంగా సమాన అవకాశం కల్పిస్తూ పార్లమెంట్ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేసారు. ఈ విషయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

### శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



**అత్తాపూర్ డిసెంబర్ 20,ప్రభాతవార్త :** మండల దీక్షను పూర్తి చేసుకొని ఉప్పరపల్లి కి చెందిన 30 మంది స్వాములు హరిహర క్షేత్రం నుంచి ఇరుముళ్లతో శనివారం శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం తన్వి క్యాటర్స్ నిర్వాహకులు బొబ్బిలి నరసింహారెడ్డి, భూపాల్ రెడ్డి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప ఆలయం నుంచి ర్యాలీగా గ్రామం పొలిమేర వరకు పాదయాత్రగా చేరుకొని శబరిమలకు బయలు దేరారు.

### ఉపాధ్యాయులు భాషా నైపుణ్యాలను పెంచుకోవాలి



**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** తెలుగు భాషోపాధ్యాయులు ఎప్పటికప్పుడు భాషా నైపుణ్యాలను పెంచుకోవాలని స్టేట్ రీసోర్స్ పర్సన్ డాక్టర్ విజయ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం బహదూర్‌పురా మండలం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం గౌలిపురా లలితా భాగ్ రోడ్డులోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ భాషగా తెలుగు బోధించే ఉపాధ్యాయులు, సాంకేతిక పరిజ్ఞానంను అందిపుచ్చుకొని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సందేహాలకు ఆర్పీలు సమాధానాలు ఇచ్చారు. జిల్లా రీసోర్స్ పర్సన్ పద్మజా కుమారి, మండల ఆర్పీ కరుణాకర్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావ్, తెలుగు భాషా ఉపాధ్యాయులు శ్రీనాథ్, విజయ కుమార్‌రెడ్డి, శ్రీధర్, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తా :మంత్రి పొన్నం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు ఇ.విజయ్ కుమార్ గౌడ్ , బి. పద్మ వెంకట్ రెడ్డి , అమృత , కన్నె ఉమా రమేష్ యాదవ్

**హైదరాబాద్ డిసెంబర్ 20 ప్రభాతవార్త :** అంబర్‌పేట్ నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్, పలువురు కార్పొరేటర్లతో రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ను శనివారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. మంత్రిని కలిసినవారిలో నియోజకవర్గంలోని వివిధ డివిజన్ ల కార్పొరేటర్లు ఇ.విజయ్ కుమార్ గౌడ్ , బి. పద్మ వెంకట్ రెడ్డి , అమృత , కన్నె ఉమా రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి, కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా నిధులను త్వరితగతిన మంజూరు చేయవలసింది గా కోరారు. వెంటనే నిధులు మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులకు అనుమతులు మంజూరు చేస్తూ నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

## జూబ్లీహిల్స్‌లో మద్యం మత్తులో కారు బీభత్సం

**జూబ్లీహిల్స్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో మద్యం మత్తులో కారు బీభత్సం సృష్టించిన సంఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లో అర్ధరాత్రి దాటిన తరువాత దాదాపు 1.15 గంటల ప్రాంతంలో జూబ్లీ వైన్‌మార్ట్ సమీపంలో వేగంగా వచ్చిన ఒక కారు ఒక్కసారిగా అదుపుతప్పి సిమెంట్ ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టింది. సిమెంట్ పోల్‌తోపాటు పక్కనే ఉన్న బీఆర్ఎస్ జెండా గద్దె సైతం దెబ్బతింది. దీంతో కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకున్నాయి. ప్రమాద విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని కారులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా అతన్ని రాజేంద్రనగర్‌కు చెందిన న్యాయవాది మువ్వ విజయ్ శిశిర్‌గా గుర్తించారు. అతనికి శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించగా రక్తంలో మద్యం మోతాదు శాతం 117గా వచ్చింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాహన ఈ చలానా పేరుతో సైబర్ మోసం

**జూబ్లీహిల్స్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ఆర్టీఓ ఈ చలానా పేరుతో వచ్చిన ఒక ఏపీకే ఫైల్ తెరిచిన చెఫ్ బ్యాంకు ఖాతాలో రూ. 78,600 సైబర్ మోసానికి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణనగర్‌లో నివసించే నరేష్ తాప ఒస్కా రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతని సెల్‌ఫోన్‌కు ఆర్టీఓ ఈ చలానా పేరుతో ఒక ఏపీకే ఫైల్ వచ్చింది. దానిని అతను దానిని తెరిచి మూసేశాడు. కాసేపటి తరువాత అతని ఖాతాలో అయిదు లావాదేవీలు జరిగినట్లు సందేశాలు రావడమే కాకుండా ఖాతాలోని రూ. 78,600లు మొత్తం గుర్తుతెలియని వ్యక్తులు తమ ఖాతాలోకి మరల్చుకున్నట్లు గుర్తించారు. దీంతో అతను సైబర్ క్రైం హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి అక్కడి నుంచి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రేమ, పెళ్లి పేరుతో మోసం.. యువకుడిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో దగ్గరై మోసానికి పాల్పడిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సోమాజీగూడలోని ఒక ఇమ్మిగ్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న యువతికి అదే కార్యాలయంలో పనిచేసే పెద్దింటి ఫణికుమార్ పరిచయం అయ్యారు. దీంతో ఇద్దరి మధ్య స్నేహం అది కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలోనే యువతి అతనికి మరింత దగ్గరై పలుమార్లు వ్యక్తిగతంగా ఇద్దరు కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న బాలాపుర బస్తీలోని ఫణికుమార్ గదికి వెళ్లిన యువతిని అతను మెడ, ఛాతిపై రక్కడమే కాకుండా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనికితోడు అతను మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నట్లు గుర్తించి నిలదీయగా తాను పెళ్లి చేసుకోనని, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించాడు. దీంతో యువతి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

